క్లుప్తంగా

నేపాల్ నుంచి వచ్చిన సాలగ్రామం



సాలగ్రామాన్ని చూపుతున్న అర్చకులు శ్రీకాంత్‌శర్మ

డోన్ : నేపాల్ దేశం ముక్తినాథ్ వద్ద గల గండకీ నది నుంచి సేకరించిన 30 కేజీల బరువు గల సాలగ్రామం బుధవారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. హైదరాబాదులోని జగన్నాథ మఠానికి చెందిన శ్రీదండి వ్రతజీయర్ స్వామి కుమారుడు అజేయస్వామి ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, ధర్మకర్త పాతాళం సుబ్బారావుకు సాలగ్రామాన్నిఅప్పగించి స్వామి వారి కైంకర్యానికి వినియోగించాల్సిందిగా కోరారు. నేటి నుంచి స్వామితో పాటు ఆలయంలో నిత్యారాధన చేస్తామని ప్రధాన అర్చకులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె సెబ్ పోలీసు స్టేషన్ సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో నాటుసారా విక్రయాలపై బుధవారం దాడులు నిర్వహించారు. పలుకూరు, చిన్నరాజుపాలెం తండా, ఇల్లూరు కొత్తపేట గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఇల్లూరుకొత్తపేట గ్రామంలో నల్లగండ్ల అశోక్‌కుమార్ అనే వ్యక్తి వద్ద 30 లీటర్ల నాటుసారా సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జోగేంద్ర తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్‌ఐ పోతులయ్య, సిబ్బంది పాములేటి, శివన్న, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు



చెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్యాపిలి: పట్టణంలోని పలు చోట్ల డివైడర్ల మధ్యలోపెన్న కోనోకార్పస్ చెట్లను గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. కేవలం ఆకర్షణీయంగా ఉండే ఈ మొక్కల ద్వారా పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజల ఆరోగ్యానికి కూడా ముప్పు కలిగిస్తాయని పట్టణానికి చెందిన పర్యావరణ ప్రేమికులు కిశోర్, చైతన్య, మౌలాలి, నరేంద్ర, వెంకటేష్ తదితరులు బుధవారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ మండల స్థాయి అధికారుల అనుమతితో చెట్లను తొలగించారు. అధికారులు వెంటనే స్పందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలసిన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న లాయర్ మహేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారిని బుధవారం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మీర్జాపురం సర్పంచ్ లాయర్ మహేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మహేశ్వరరెడ్డి తెలిపారు.

యోగాతో మానసిక, శారీరక వికాసం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డోన్: మానసిక, శారీరక వికాసానికి యోగా సాధన అత్యుత్తమ మార్గమని ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నాగజాస్మిన్ అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు పది రోజులుగా జరుగుతున్న యోగా శిక్షణ ముగింపు సందర్భంగా యోగా సాధనలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు క్లబ్ అధ్యక్షురాలు మద్దమ్మ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగభూషణంరెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. క్లబ్ సభ్యులు రాజా సుజాత, ముడియాల శైలజ, సుమిత్ర, ఉపాధ్యాయిని సోనూ పాల్గొన్నారు.

మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలి

బేతంచెర్ల: మొహర్రంను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శివశంకర్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. పార్టీలకు సంబంధం లేకుండా గ్రామాల్లో కొలువు దీరన పీర్ల చావిడీల వద్ద వేడుకలు ముగిసేంత వరకు స్నేహపూర్వక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు.

పంట మార్పిడి..అధిక దిగుబడి

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- తెగుళ్లు, చీడపీడల నివారణ



సంజామల వద్ద సాగు చేసిన మొక్కజొన్న

సంజామల: రైతన్న పొలంలో ప్రతి సారి వేసిన పంట మళ్లీ వేయడం వలన దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా రైతన్న ఏట పంట మార్పిడి చేయడం వలన మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఏటా పంట మార్పిడి చేయడం రకారకాల పంటను వేయడంతో రైతులు అధిక ప్రయోజనాలు పొందవచ్చంటున్నారు. పంట మార్పిడి చేయడంతో ప్రకృతి వనరులను సంవర్ధవంతంగా వినియోగంచుకోవచ్చు. తక్కువ పెట్టబడితో పాటు భూసారం తగ్గకుండా ఉంటుంది.

ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధం

ఈ ఏడాది వర్షాలు సీజన్ ప్రారంభంలోనే కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్నారు. మండలంలో 45వేల ఎకరాల సాగుభూమి ఉంది. ఇందులో బోరుబావులు, చెరువులు, కాలువల ఆధారంగా ఎక్కువగా వరి,మిర్చి పంటలను సాగు చేస్తున్నారు. మిర్చి పంట దాదాపు 9వేల ఎకరాలు, వరి పంట దాదాపు 8వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట మార్పిడిపై వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి సూచిస్తున్నారు.

పంట మార్పిడి చేయకపోతే నష్టాలు..

- ఏటా ఒకే రకం పంట పండించడం వలన చీడ పురుగులు, కలుపు మొక్కల బెడద ఉంటుంది. అందువలన పైరు కూడా ఆశించిన దిగుబడి ఉండదు.
- వేరు వ్యవస్థ ఒకే తోతుకు పోవడం వలన నేలలో అక్కడి వరుకు ఉన్న పోషకాలు మాత్రమే మొక్కలు ఉనియోగించుకుంటాయి.
- నేల కోతకు గురవుతుంది.
- ఒకే తరహా పంట వేస్తే పండిన పంట నాణ్యత ఉండదు. దాని ఫలితంగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించదు.
- భూసారం తగ్గుతుంది. దాని వలన ఆశించిన పంట ఉండదు. పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. రాబడి తక్కువగా ఉంటుంది. దీంతో రైతు నష్టపోయే అవకాశం ఉంది.

పంట మార్పిడితో లాభాలు



చాలా మంది రైతులు ఏటా ఒకే రకం పంట తరుచుగా సాగు చేస్తుంటారు. రైతులు పంట మార్పిడి వేయడం ద్వారా మంచి దిగుబడి పొందే అవకాశాలు ఉన్నాయి. మండలంలో నీటి పారుదల ఉన్న చోట్ల మిర్చి, వరి తప్ప ఇతర పంటలు వేయడంలేదు. దీంతో పంటలో చీడపురుగులు ఉధృతి పెరగడమే కానీ తగ్గే అవకాశాలు ఉండవు. అదే పంట మార్పిడి చేస్తే చీడపీడలను అరికట్టవచ్చు.రైతులు పంట మార్పిడికి వైపు అడుగులు వేయాలి.

–సుధాకర్ రెడ్డి, సంజామల మండల వ్యవసాయ అధికారి

నిబంధనలు పాటించకపోతే చర్యలు



పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

ప్యాపిలి: పెట్రోల్ బంక్ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ నిర్వాహకులు ప్రామాణికత పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. పెట్రోల్ బంకుకు వచ్చే వారికి తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం జేసీ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోతుదొడ్డి గ్రామంలో రేషన్ వాహనం ద్వారా జరుగుతున్న సరుకుల పంపిణీపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ మహేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లపై వేధింపులు అరికట్టాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

బనగానపల్లె రూరల్ : అధికార పార్టీ నాయకులు అంగన్‌వాడీ వర్కర్ల పై చేస్తున్న వేధింపులను వెంటనే అరికట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయు జిల్లా కార్యవర్గ సభ్యులు జేవీ సుబ్బయ్య,అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సరస్వతి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీ వర్కర్ల కోరికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలు డిమాండ్లను పరిష్కారించా లని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జేవీ సుబ్బయ్య, సరస్వతి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీ అమలుకు ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు రమాదేవి,హేమలత,ఉమా, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: దేశవ్యాప్తంగా స్కీం వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆల్‌ఇండియా కమిటీ పిలుపు మేరకు కోర్కెల దినోత్సవ సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు శివనాగలక్ష్మి, లక్ష్మిదేవి, బిందు, దేవి, పుల్లమ్మ పాల్గొన్నారు.

సంజామల: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బుధవారం మండల కేంద్రం సంజామల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులు సుజాత, దైనమ్మ, వెంకట లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటలపై అవగాహన కల్పించాలి

బేతంచెర్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న అధ్యక్షతన ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకం, గృహ నిర్మాణంలో 90 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల వివరాలు, మస్టర్లు పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు 74 ఎకరాల్లో తోగల సాగుకు రైతులు ముందుకొచ్చారని, మంజూరైన రైతులతో గుంతలు తవ్వించి మొక్కలు నాటించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకొని గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీసు బందోబస్తు మధ్య వేలం పాట



డిపాజిట్ దారులను లోనికి అనుమతిస్తున్న పోలీసులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంత నిర్వహణ కోసం బుధవారం లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో పోలీసుల బందోబస్తు మధ్య వేలపాట జరిగింది. వేలం సమయంలో వాదోపవాదాలు చోటు చేసుకుంటాయనే ఉద్దేశంతో సీఐ గోపీనాథ్‌రెడ్డి దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. వేలం పాటలో పాల్గొనే వారిని మాత్రమే డిపాజిట్ చెల్లించాక లోనికి అనుమతించారు. ఆలయ ఆవరణలో గుంపులుగా ఉన్న జనాన్ని బయటకు పంపించారు. లోనికి ఎవరిని అనుమతించక పోవడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో నంద్యాల డీఎల్‌డీఓ రాంబాబు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రావు వేలం పాట ప్రారంభించారు. మొదట గ్రామ పంచాయితీ రూ.2.50 లక్షలు నిర్ణయించింది. ఐదారు మంది మాత్రమే వేలంలో పోటీ పడ్డారు. చివరకు బోయ కిరణ్ రూ.4.80 లక్షలకు దక్కించుకున్నాడు. 25 మంది వేలం పాటలో పాల్గొన్నా చాలా మంది మౌనంగా ఉండిపోయారు. గతేడాది కంటే ఈసారి గ్రామ పంచాయతీకి రూ.30 వేలు అదనపు ఆదాయం సమకూరింది. సీఐ చొరవతో వేలం పాట ప్రశాంతంగా ముగిసింది.

హెల్మెట్ ధరించండి



అవగాహన కల్పిస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో రోడ్డు భద్రత గురించి,హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించక పోవడం కారణంగానే తలకు బలమైన గాయాలై మృత్యువాత పడుతున్నారన్నారు. న్యాయవాదులు,కోర్టు సిబ్బంది ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: గ్రామ సేవకుల, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఆలిండియా కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా కార్మికులు సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ బేసిక్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. గ్రామ సేవకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్, అంగన్‌వాడీల సంఘం నాయకురాలు శోభ పాల్గొన్నారు.

ప్యాపిలి: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డేలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఎండీఎం నిర్వాహకులు, ఉపాధి హామీ సిబ్బంది, మెప్మా, సమగ్ర శిక్ష, ఆయుష్, గ్రామ పంచాయతీ, మునిసిపల్, స్వచ్ఛభారత్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాసులు, హుసేన్, లక్ష్మణ్, చెన్నయ్య, ఓబులపతి, ఇలియాజ్, జాఫర్ పాల్గొన్నారు.

డోన్ టౌన్ : కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసి స్కీం వర్కర్లకు,కంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి శివరాం, మండల అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు,భాస్కర్‌రెడ్డి,పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపు మేరకు పట్టణంలో వివిధ సంఘాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. నాయకులు నాగన్న, సులోచన, రహమత్‌బీ, సుమలత, ఆదినారాయణ, మద్దిలేటి, గుండాలయ్య, లక్ష్మణ్, శ్రీనివాసులు, కుల్లాయప్ప, రామాంజనేయులు, వరలక్ష్మీ పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ వర్కర్ మృతి



తిరుపతమ్మ (ఫైల్)

బనగానపల్లె రూరల్ : మండలంలోని చిన్నరాజుపాళం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ తిరుపతమ్మ(58) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. తిరుపతమ్మకు మంగళవారం బీపీ డౌన్ కావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు బనగానపల్లెలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకొచ్చారు . అక్కడి వైద్యులు తిరుపతమ్మకు గుండెవీక్‌గా ఉందని వెంటనే శాంతిరామ్ వైద్యశాలకు తీసు కెళ్లాలని సూచించారు. శాంతిరామ్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బనగానపల్లె సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించాలి

బనగానపల్లె రూరల్ : జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ సమస్యను పరిష్కరించి మొత్తాన్ని ఆయా ఉపాధ్యాయుల ఖాతాలో జమ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సంఘం మండల అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. సత్యప్రకాష్ మాట్లాడుతూ మండల పరిషత్ ఉపాధ్యాయుల షెడ్యూల్స్ జెడ్పీ కార్యాలయానికి అందజేసినా కూడా ప్రావిడెంట్ ఫండ్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిదికాదన్నారు. అలాగే జీఓ నెంబరు 117ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులకే తల్లికి వందనం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు దస్తగిరి, సుధాకర్, కృష్ణయ్య, సన్నన్న లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేయాలి

కోవెలకుంట్ల: రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మండలంలోని భీమునిపాడు రైతు సేవాకేంద్రం పరిధిలో బుధవారం రైతుల పొలాల్లో మట్టినమూనాలు సేకరించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి ఏటా మండలంలోని గ్రామాల్లో 50 మంది రైతులకు సంబంధించి మట్టినమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేస్తున్నామన్నారు. భూమిలో ఉన్న వివిధ పోషకాలను రైతులకు తెలియజేసి అందుకనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

టెండర్లకు స్పందన కరువు

డోన్ టౌన్ : 2024–25కు మున్సిపల్ ఆధ్వర్యంలోని దినసరి కూరగాయల సంత, వారపు సంత, జంతువధశాల, బస్టాండ్ తదితర వాటి కోసం నిర్వహించిన టెండర్లకు స్పందన లభించలేదు. బుధవారం మున్సిపల్ రెవెన్యూ అధికారి మధుసూదన్ బాబు, డీఈ రసూల్, మేనేజర్ ఆరీఫ్ బాషా సమక్షంలో టెండర్ల బాక్స్‌ను తెరచి చూడగా ఇద్దరు మాత్రమే టెండర్లు దాఖలు చేశారు. మున్సిపల్ నిర్ణయించిన అంచనా మేరకు రూ.16 లక్షలు ఉండగా గురుస్వామి రూ.12 లక్షలకు దాఖలు చేసినట్లు తెలిపారు. అంచనా మొత్తానికంటే తక్కువగా టెండర్లు దాఖలు కావడంపై కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

చౌక ధరకు కంది పప్పు, బియ్యం



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

డోన్ టౌన్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరకు కందిపప్పు, బియ్యాన్ని అందించనుందని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్న సివిల్ సప్లై అవుట్‌లెట్ షాప్‌ను ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో 2, ఆళ్లగడ్డ,డోన్,ఆత్మకూరు పట్టణాల్లో ఒకటి చొప్పున మొత్తం జిల్లా వ్యాప్తంగా ఐదు అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవుట్ లెట్‌లలో కిలో కంది పప్పు ఒక్క కుటుంబానికి కేజీ రూ.120, స్టీమ్ ఫైన్ రైస్ కిలో రూ.49 చొప్పున ఐదు కిలోలు, బీపీటీ సోనా మసూరి కిలో రూ.48 ప్రకారం ఐదు కిలలోలు గురువారం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు.

పశుగ్రాసం పెంచుకోవాలి



పశువులకు చికిత్స అందిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్

బనగానపల్లె రూరల్ : పాడి రైతులు పచ్చిమేత పశుగ్రాసం పెంచుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని ఎర్రగుడి గ్రామంలో బనగానపల్లె పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మారుతిసకారామ్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పశువులకు పచ్చిమేత వేయడం వల్ల పాలు ఎక్కువగా ఇచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో ఉండే పశువైద్య సిబ్బంది సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. పలువురు పాడి రైతులకు గ్రామ సర్పంచ్ బండి వరలక్ష్మి చేతులమీదుగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండిభాస్కర్‌రెడ్డి, పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

బనగానపల్లె రూరల్ : మండలంలో వీఆర్‌ఏలకు వేతనం చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, తమకు వెంటనే వేతనం చెల్లించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండల వీఆర్‌ఏల సంఘం సెక్రటరీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో సుమారు 18 వరకు వీఆర్‌ఏలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. 10వ తేదీ వచ్చిన వీఆర్‌ఓలకు మాత్రం ఇంత వరకు వేతనం చెల్లించలేదన్నారు. దీంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కారించాలని కోరారు. అలాగే ఎన్నికలకు సంబంధించిన టీఏ,డీఏలు కూడ వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

బస్సు ఆలస్యం..విద్యార్థుల అవస్థలు

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సులు వేళకు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బుధవారం బూరుగుల నుంచి డోన్‌కు వచ్చే బస్ సర్వీసు ట్రాఫిక్ కారణంగా ఆలస్యంగా పట్టణానికి చేరుకోవడంతో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు తరగతులకు సరైన సమయానికి చేరుకోక పోవడంతో సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దీంతో విద్యార్థులు గేటు వద్దే నిలిచిపోయారు. లోపలికి అనుమతించకపోవడంపై ఐటీఐ సిబ్బందిని ప్రశ్నించగా.. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అనుమతించలేదని తెలిపారు.

జయప్రదం చేయండి

బేతంచెర్ల: పట్టణంలోని ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ఈనెల 13వ తేదీన జరిగే ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, ఆజాంబేగ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి , రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హాజరవుతారని చెప్పారు.

యాగంటి క్షేత్రంలో మౌనవ్రతం



శ్రీశంభుసోమనాథ్ శివాచార్యులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలోని మారునీళ్ల చెలిమ వద్ద ఉన్న శివాలయంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సుల్తానాపుర శ్రీ పంచాక్షరీ మహా సంస్థాన తీర్థ బృహన్మఠం పీఠాధిపతి శ్రీశంభు సోమనాథ్ శివాచార్యులు బుధవారం మౌనవ్రతం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయంలో హోమం నిర్వహించారు. శ్రీ శంభుసోమనాథ్ శివాచార్యులు గతేడాది కూడా ఆలయంలో మౌనవ్రతం చేశారు. లోక కళ్యాణార్థం 11 రోజుల పాటు మౌనంపాటించి హోమాలు నిర్వహించనున్నట్లు స్వామివారి భక్త బృందం సభ్యులు తెలిపారు.

మరుగుదొడ్లు నిర్మించండి



ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

డోన్ టౌన్ : స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే నిర్మించాలని అంగన్ వర్కర్ల యూనియన్, సులోచన, రమత్‌బీ, సుమలత, మంజుల, సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శివరామ్, నక్కి శ్రీకాంత్ కోరారు. బుధవారం ఈ మేరకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ డోన్ ప్రాజెక్టు పరిధిలో డోన్,బేతంచెర్ల,ప్యాపిలి మండలాలకు చెందిన 288 అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలతో పాటు కార్యాలయంలో దాదాపు 15 మంది పైగా ఉద్యోగినులు ఉన్నప్పటికీ మరుగుదొడ్లు లేవని తెలిపారు. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆశోక్, లక్ష్మేశ్వరి, సుభద్ర, యశోధ, శ్రీలక్ష్మీ, రామలక్ష్మీ, అనసూయ,ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

పచ్చని గ్రామంలో చిచ్చు రేపే పన్నాగం

డోన్ : నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటనాయునిపల్లి గ్రామంలో గత ఆదివారం పొలం గట్టు విషయంలో గొల్ల మాధవయ్య అనే వ్యక్తిపై వేటకొడవలితో మరో కుటుంబానికి చెందిన బోయ చంద్రప్రకాష్, చెన్నయ్య దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మాధవయ్య కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడు. ఇదిలా ఉండగా..ప్రశాంతంగా ఉన్న గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన భూ తగాదాను రెండు కులాల మధ్య, రెండు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య జరిగిన ఆధిపత్య పోరుగా చిత్రీకరించేందుకు స్థానిక టీడీపీ నాయకులు యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి గ్రామంలో శాంతిభద్రతలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య బుధవారం తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో తిరిగే బస్సు సరీ్వసులపై సూచనలు, సలహాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 99592 25798కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలన్నారు.